సొంతింటి కల సాకారమయ్యేనా..?

- వసతుల లేమితో చేరలేక పోతున్న టిట్కో లబ్ధిదారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గతంలో 2014-2019 అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం పేదవారికి సొంతింటి కల నెరవేర్చడానికి కర్నూలు నగరం జగన్నాథగట్టు రింగ్ రోడ్డు సమీపంలో పదివేల గృహాలను షేర్‌వాల్ టెక్నాలజీతో మొదలు పెట్టారు. పూర్తయిన కొద్దిపాటి ఇళ్లలో లబ్ధిదారులు నివాసం ఉండేందుకు సరైన మౌలిక వసతులు లేక ఉండటానికి సుముఖంగా లేరు. ఎ బ్లాక్ 300 ఎస్ఎఫ్‌టి, బి బ్లాక్ 365 ఎస్ఎఫ్‌టి, సింగిల్ బెడ్ రూమ్, సి బ్లాక్ 430 ఎస్ఎఫ్‌టి డబుల్ బెడ్ రూమ్ కలిగిన ఇండ్లు నిర్మించారు.

ఎ బ్లాకులో 3888 మంది లబ్ధిదారులలో 1152 మందికి అప్పగించారు. 875 మందికి తాళాలు ఇచ్చారు. బి-బ్లాక్‌లో 1904లో 574 హ్యాండ్ ఓవర్ చేయగా 135 మందికి తాళాలు ఇచ్చారు. సి బ్లాక్ లో4208 లో 474 హ్యాండ్ ఓవర్ చేయగా 20 మందికి తాళాలు ఇచ్చారు. ప్రస్తుతం టిడ్కోగృహాల్లో 140 మంది నివాసం చేస్తున్నారు. రోజు విడిచి రోజు వారికి నీళ్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యం ఉంది. అయితే లబ్ధిదారుల అక్కడ నివాసం ఉండడానికి కావలసిన ముఖ్యమైన మౌలిక సదుపాయాలలో రవాణా, సెక్యూరిటీ, మార్కెట్, అంగన్వాడి స్కూలు, ఆసుపత్రి లాంటివి లేవు...ప్రధానంగా చిన్న చిన్న చేతివృత్తులు చిన్న పరిశ్రమలు లాంటివి ఉత్పాదకతను పెంచే చిన్న పరిశ్రమలు నెలకొల్పాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రవాణా సౌకర్యం లేని కారణంగా కర్నూలు పట్టణంలోకి వచ్చి పోవాలంటే ఆటోలకు రూ.200 ఖర్చు అవుతుంది. ఇదిలా ఉండగా చాలామంది పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించినప్పటికీ ఇంతవరకు లబ్ధిదారులకు ఇళ్లను అప్పు చెప్పకపోవడంతో నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా అప్పజెప్పడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం నవంబర్ 17 నాటికి 976 ఇళ్లను అప్పజెప్పాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ ప్రస్తుతం 187 మందికి ఇళ్లను అప్పజెప్పేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు చెప్పారు. గతంలో లబ్ధిదారులు డిడ్కో గృహాల కోసం డబ్బులు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ చేసి బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేశారు. బ్యాంకర్ల ఫోన్లు చేయడంతో విసిగి వేసారి ఇల్లు ఇవ్వకుండా ఎలా చెల్లించాలంటూ ప్రశ్నించగా ప్రభుత్వం వారు చెల్లించిన డబ్బులకు వడ్డీ జమ చేస్తూ డబ్బులు కట్టవద్దంటూ చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరికొందరు పూర్తిస్థాయిలో రూ.లక్ష అప్పుగా తెచ్చి చెల్లించామని చెప్పారు. తామ తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని వీలైనంత త్వరలో ఇళ్లను మాకు స్వాధీనం చేయాలని కోరుతున్నారు. అయితే 10 వేల ఇండ్లు ఎప్పటికి పూర్తి చేసి సొంతింటి కల నెరవేరుతుందనేది ప్రశ్నార్థకం.....

నెలకు రూ.6 వేలు వడ్డీ కడుతున్నా

నాకు ఇల్లు మంజూరు అయింది. గ్రౌండ్ ఫ్లోర్ సి.బ్లాక్ 162 నెంబర్ గల ఇల్లు ఇచ్చారు. ఇల్లు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పారు. నేను రూ.4 లక్షల 15 వేలు కట్టాను. అధికారుల దగ్గరకు వచ్చి అడగగా డిసెంబర్లో రిపేర్లు చేసి ఇల్లును అప్పజెప్పుతామని అధికారులు చెప్పారు. నాలాగే 200 మంది ఫుల్ అమౌంట్ కట్టి ఉన్నారని అధికారులు చెప్పారు.

- కె.జయలచ్చమ్మ ఎల్కూరు ఎస్టేట్.

కట్టిన డబ్బులు వాపసు ఇవ్వాలి

తాను టిడ్కో గృహానికి రూ.లక్ష కట్టాను. నేను వేరే ఊర్లో ఉంటున్నాను. నాకు లోను మంజూరు కాలేదు. నేను కట్టిన డబ్బులు నాకు వాపసు ఇవ్వమని కోరుతున్నా.

- నర్సమ్మ, అబ్బాస్ నగర్.

ఐదు సంవత్సరాలుగా తిరుగుతున్నా

ఇన్ ఎలిజిబుల్ కింద నాకు ఇస్తామన్న ఇల్లు క్యాన్సిల్ చేశారు. తాను కట్టిన రూ.లక్ష రూపాయలు ఇవ్వాలని ఐదేళ్లుగా తిరుగుతున్నా ఇంతవరకు ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం నుండి డబ్బులు వస్తేనే ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

- మహేశ్వరి, గురు రాఘవేంద్ర నగర్.

నవంబర్ 976 ఇళ్లను ఇస్తాం

లబ్ధిదారులు డబ్బులు కట్టి రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అన్ని హంగులతో రిపేరు చేసి నవంబర్ నెలాఖరుకు 976 ఇండ్లు అప్పగిస్తాం. 200 మంది ఫుల్ అమౌంట్ కట్టి ఉన్నారు. ఈనెల 17న 187 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించాం. మిగతా వారికి వీలైనంత త్వరలో ఇళ్లను అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తున్నాం.

- టిడ్ కో టెక్నికల్ అధికారి పెంచలయ్య.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కార్మికుల హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు నేతలు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. సిఐటియు, ఎఐటియుసి నగర కార్యదర్శులు విజయ్, వెంకటేష్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, ఎస్.మునెప్ప మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బ్రిటిష్ కాలం నుండి అనేక పోరాటాలు, అశేష త్యాగాలు చేసి కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 2019 లో వేతన కోడ్, 2020లో పారిశ్రామిక కోడ్, ఆక్యుపేషనల్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ కోడు 4 లేబర్ కోడులను తీసుకొని వచ్చింది. ఈనెల 21 నుండి లేబర్ కోడులు అమలులోకి వస్తాయని 29 కార్మిక చట్టాలు రద్దయిపోతాయని నిర్ణయించడాన్ని భారత కార్మిక వర్గం కార్మిక హక్కులను కాలరాసే దినంగా భారతదేశ చరిత్రలో చీకటి రోజుగా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల భారతదేశ కార్మిక వర్గం రక్తతర్పణంతో త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని విధానం 12 గంటలకు మారుతుందన్నారు. కార్మికులు యజమానులతో జీతభత్యాల కోసం బేరసారాలాడే హక్కును కోల్పోతారన్నారు. ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో కార్మికులకు భద్రత లేకుండా పోతుందన్నారు. యజమాని అనుమతులు లేకుండా కార్మికుల హక్కుల కోసం సంఘాల స్థాపన సమ్మె చేయడానికి వీలు లేకుండా చేయడానికి, సమ్మెలు చేయడానికి ఉండే సామాజిక హక్కులు హరించుకు పోతాయన్నారు. యజమానికి అనుకూలంగా కార్మిక వర్గం బానిసలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇలాంటి లేబర్ కోడులు మాకు అవసరం లేదని తక్షణమే బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకొని 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి కూటమి గెలుపు ఆసరాగా తీసుకొని అహంకారంతో, దేశ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలను కొల్లగొట్టి కోట్లు గడిస్తున్న కార్పొరేట్ల కోసం తెగించి లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకోకపోతే బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశకార్మిక వర్గాన్ని కూడగట్టి దేశవ్యాప్త ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సిఐటియు నగర నాయకులు సాయిబాబా, గోపాల్, నరసింహులు, సుధాకరప్ప, ఏసు, మెడికల్ రెప్స్ నాయకులు ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎసిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులు పండించే పంటలకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రైతులు పండించే పంటలకు మార్కెటింగ్ చేసే విధంగా కలెక్టర్ ట్రేడర్లతో సమావేశం నిర్వహించారు.. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ, సాగు చేసిన పంటలకు సరైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ట్రేడర్లను ఆదేశించారు. రైతులు సాగు చేసిన పంటలను ట్రేడర్లతో మ్యాపింగ్ చేసి రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు న్యాయమైన ధర అందే విధంగా మార్కెట్ కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో రైతులు పండించే ప్రధాన పంటలకు మార్కెట్ లింకేజీలు బలపరుచుకోవాలన్నారు. మార్కెట్ యార్డుల్లో శానిటేషన్ సక్రమంగా జరిగే విధంగా చూసుకోవాలని కలెక్టర్ మార్కెట్ ఏడిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణారెడ్డి, మార్కెటింగ్ ఎడి నారాయణ మూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి, ట్రేడర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

పోరాటాలు ఉధృతం

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి కర్నూలు

సిపిఎం కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ వారంలో బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటించి సమస్యలు సేకరించి తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. సాగు, తాగునీటి సమ్యలు పరిష్కరించాలని, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, రైతు పండించిన పంటలకు గిట్టుబాట ధర కల్పించాలని, వలసలు నివారించి ఉపాధి కల్పించాలని సమస్యలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు సమర్పించారు.

విద్యుత్ పోరాటం: ట్రూ అప్ ఛార్జీల వసూలును ఉపసంహరించుకోవాలని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని లేకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు హెచ్చరించారు. మరో ట్రూ అప్ ఛార్జీల వసూలుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన సందర్భంగా ట్రూ అప్, సర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎపి ఇఆర్‌సి చైర్మన్ పివిఆర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు.

ప్రజా సంఘాల పోరుబాట : కర్నూలు కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించా లని ఈనెల 21 నుంచి ధర్నాలు ప్రారంభించారు. 26 వరకు వరుసగా నిరసనలు తెలపాలని సంఘం నిర్ణయించింది. నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న రైతును ఆదుకోవాలని ఒక రోజు దీక్షలు చేశారు. ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని , పెద్దహరివాణంను మండల కేంద్రం చేయాలని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో దీక్షలు చేస్తున్నారు.

సాగునీటి పోరు : కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టు సాధన కోసం ఈనెల 24, 25 తేదీల్లో జల సమర దీక్ష నిర్వహిస్తున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష పేర్కొన్నారు. జల సమర దీక్షకు పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు పాల్గొని మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈనెల 20న జల సమర దీక్షకు సంబంధించిన గోడపత్రికలను రవీంద్రవిద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య, కర్నూలు జిల్లా మేధావుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు మన్సూర్ రెహ్మాన్‌లతో కలిసి శ్రీహర్ష ఆవిష్కరణ చేశారు.

ఆర్‌యులో ఫలించిన పోరాటం : రాయలసీమ యూనివర్సిటీలో ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీసు రెన్యువల్‌కు సంబంధించిన ఆమోద ముద్ర వేస్తూ రాయలసీమ యూనివర్సిటీ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సర్వీస్ రెన్యువల్ పై పోరాటం చేశారు. వారు చేసిన పోరాటానికి వర్సిటీ ఉన్నతాధికారులు దిగివచ్చి సర్వీసును రివ్యూ కమిటీ లేకుండానే అమలు చేసేశారు. ఇందులో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ముగ్గురు , ఎంటిఎస్ పద్ధతిలో పనిచేసిన ముగ్గురిని విధుల్లోకి తీసుకోలేదు. వర్సిటీ ఉన్నతాధికారుల చర్యలను ఖండించారు. వర్సిటీ ఉన్నతాధికారుల చర్యలను తప్పుపడుతూ రాష్ట్ర హైకోర్టును కూడా ఆశ్రయించారు. యుజిసి నిబంధనల ప్రకారం వీరి సర్వీసులను యధావిధిగా రెన్యువల్ చేయాలని హైకోర్టు కూడా గత నెలలో మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. చివరికి హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అమలు చేస్తూ ఈ నెల 19న రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్ బి విజయకుమార్ నాయుడు ఆరుగురికి సర్వీస్ రెన్యువల్ చేస్తూ విధుల్లోకి తీసుకుంటున్నట్లు ఆదేశాలు ఇచ్చారు.

మహాసభలు : ఎపి కౌలు రైతు సంఘం జిల్లా 2వ మహాసభ నంద్యాలలోని టి.నరసింహయ్య భవన్‌లో ఈనెల 16న నిర్వహించారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు హాజరయ్యారు. సిఐటియు నంద్యాల జిల్లా 3వ మహాసభలకు బేతంచర్ల పట్టణంలో ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి హాజరయ్యారు.

అన్నదాతకు ఊరట: అన్నదాతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుతాలు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ 2025-26 రెండో విడత నిధుల విడుదల చేశారు. రాష్ట్రం రూ.5వేలు, కేంద్రం రూ.2 వేలు రైతుల ఖాతాలో జమ చేశారు. కేంద్ర ఉద్యాన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ బిజె.బ్రహ్మఈనెల 18న కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి, గోనెగండ్ల మండలం గాజులదిన్నె, గోనెగండ్ల గ్రామాల్లో ఉల్లి పంటను సాగు, ఉత్పత్తి, విస్తీర్ణ అంశాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు.

దిశ కమిటీల సమీక్ష: ఈ వారం రెండు జిల్లాల్లో దిశాకమిటీ సమావేశాలు నిర్వహించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అధ్యక్షతన, కర్నూలు జిల్లాలో ఎంపీ బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంత విద్యాభివృద్ధిలో భాగంగా పిల్లలు చదువుకునేందుకు అవసరమైన హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపాలని దిశా కమిటీలో చర్చించారు. కర్నూలు జిల్లా పంచాయతీ అధికారికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. మెసేజ్ పెట్టినా... స్పందించ లేదని ఎంపి సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు అధికారులు మాట ఎందుకు వినడం లేదనే చర్చకు దారి తీసింది. పర్సెంటేజీలు, లంచాలకు రుచిమరిగిన ప్రజాప్రతినిధులకు అధికారులు ఎందుకు మాట వింటారని ఉమ్మడి జిల్లాలో చర్చ నీయాశంగా మారింది. గత ప్రభు త్వంలో మా మూళ్ల వసూళ్లన్నీ నేరుగా అధినేతకు వెళ్తేవని, ప్రస్తుత ప్రభుత్వంలో ఎమ్మె ల్యేలు, ఎంపీలు, వారి అను చరులు వసూలు చేసి అధినేతకు పంపుతున్నారని ప్రజలు అనుకుంటున్నారు.

మాట్లాడుతున్న అపుస్మా వ్యవస్థాపకులు వల్లపురెడ్డి జనార్ధన్‌రెడ్డి, జి.పుల్లయ్య, తదితరులు

అపుస్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి -కర్నూల్ కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఏ క్యాంపు లోని మాంటిస్సోరి పాఠశాలలో పోటీలను నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం వంటి అంశాలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర అపుస్మ వ్యవస్థాపకులు వల్లపురెడ్డి జనార్ధన్ రెడ్డి , రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య, మాంటిసోరి స్కూల్ అధినేత రాజశేఖర్ ప్రారంభించారు. రాష్ట్ర అపుస్మా సభ్యులు కెవిఆర్.శ్రీనివాసరెడ్డి, కర్నూలు జిల్లా ప్రసిడెంట్ వాసుదేవయ్య, సలహాదారులు పిబివి.సుబ్బయ్య, సిటీ ప్రసిడెంట్ యుగంధర్, సెక్రటరీలు శ్రీనివాసులు , మాధవ కృష్ణ, రమణ తదితర ఇసి సభ్యులు విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పోటీలను తిలకించారు.

శిథిలమవుతున్న పోలీసుల భవనాలు

- ఖాళీ అవుతున్న పోలీసు కాలనీలు

- పాములు, పందికొక్కులకు నిలయంగా రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనాలు శిథిలమవు తున్నందున సిబ్బంది ఖాళీ చేస్తున్నారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం స్పందించి క్వార్టర్స్ నిర్మించాలని పూర్వ డిప్యూటీ పోలీస్ సూపరిండెంట్, న్యాయవాది సిహెచ్.పాపారావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, మహ్మద్ యూనుస్, ఎన్.మద్దిలేటి కోరారు. శనివారం పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం కొత్తపేట, మార్కెట్ యార్డ్ సమీపంలో ఉండే పోలీస్ కాలనీల్లో పర్యటించింది. వారు మాట్లాడుతూ... ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసు సిబ్బంది క్వార్టర్స్‌లో భయపడుతూ జీవిస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో లోకల్ పోలీసు కాలనీలో పోలీసు సిబ్బంది పూర్తిగా ఖాళీ చేశారన్నారు. కొత్తపేట సమీపంలోని పోలీసు శాఖ భవనాలు శిథిలమవుతున్నాయని తెలిపారు. నీళ్ల ట్యాంకుపైన అపాయం అంటూ రాసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారని చెప్పారు. నీళ్ల ట్యాంకు కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. క్వార్టర్స్ శిథిలమై రూ.వందల కోట్ల ప్రభుత్వ భూములు పాములకు, పందికొక్కులకు నిలయంగా మారాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొత్త కార్టర్స్ నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరిగి, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడిన వారవుతారన్నారు. ఎస్.అర్దార్, సివి.వర్మ, ఎస్.అన్వర్ బాష, ఈ.లక్ష్మణ గౌడు పాల్గొన్నారు.

ప్రాపర్టీ కేసులు చేధించాలి

ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రాపర్టీ కేసులు చేధించి , రికవరీల శాతాలను బాగా పెంచాలని జిల్లాలోని పోలీసు అధికారులకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తగ్గించడమే లక్ష్యంగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధులలో రోడ్డు ప్రమాదాల నివారణ కు పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు రాత్రి వేళలో ఎక్కువ జరుగుతున్నాయన్నారు. గుంతలు, మలుపులు ఉన్నచోట రోడ్డు ప్రమాదాలు జరగవచ్చు అనే ప్రాంతాలను గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోడ్లకు తగిన మరమ్మతులు చేయించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే ఓవర్ లోడింగ్ వాహనాలను వెంటనే నిలిపి వేయాలన్నారు. మద్యం తాగి వాహనం నడుపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, అతివేగం , హెల్మెట్ లేకుండా ప్రయాణించరాదని ప్రజలకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. మర్డర్ల కంటే రోడ్డు ప్రమాదాలలోనే మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఆదివారం పోలీసుస్టేషన్ లలో రౌడీ షీటర్లను బాగా కౌన్సిలింగ్ చేయాలన్నారు. వయస్సు పై బడిన కొందరు రౌడీ షీటర్లు, రౌడీషీట్‌లను తొలగించాలని ఎస్‌పికి విన్నవించారు. ఆదివారం భారత్ బంద్ ప్రకటించిన సంధర్భంగా పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ ఎన్ కౌంటర్‌పై కర్నూలు కలెక్టరేట్ దగ్గర ర్యాలీలో పాల్గొన్న వారి పూర్తి వివరాలను సేకరించాలని అడిషనల్ ఎస్‌పి సూచించారు. గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి ఎస్‌పి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నేర సమీక్ష వేశంలో అడిషనల్ ఎస్‌పిలు హుస్సేన్ పీరా, కష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డిఎస్‌పిలు బాబు ప్రసాద్ , వెంకట్రామయ్య , హేమలత, భార్గవి , సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సుఖీభవ హాస్పిటల్ పునః ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నగరం కల్లూరు అర్బన్ 32వ వార్డ్ గోవర్ధన్ నగర్ ప్రాంతంలోని సుఖీభవ ఆసుపత్రిని ప్రముఖ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, మేనేజింగ్ పార్ట్‌నర్ టి రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ డాక్టర్ ప్రశాంత రెడ్డి సుఖీభవ హాస్పిటల్‌ను ప్రారంభించారు. డాక్టర్ చరణ్ మాట్లాడుతూ సుఖీభవ ఆసుపత్రిలో కర్నూలు ప్రజలకు అందుబాటు ధరలతో, 24 గంటలపాటు వైద్య సేవలు అందిస్తామన్నారు. మరోవైపు మధ్యతరగతి, పేద ప్రజలకు ప్రభు త్వం అందిస్తున్న ఆరోగ్య శ్రీ ద్వారా ఆరు రకాలు జనరల్ సర్జరీ, గైనిక్, ఆర్థో పెడిక్, పాలిట్రామా, యురాలజీ వంటి చికిత్సలు సైతం వర్తింపజేస్తామన్నారు. సుఖీభవ ఆసుపత్రి అందించే వైద్య సేవలను కర్నూలు జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, ఇప్పల నారాయణ రెడ్డి, గాయత్రి ఎలక్ట్రికల్స్ అధినేత మంచాల సుధాకర్ రెడ్డి, మంచాల అజిత్ రెడ్డి, కల్లూరు సొసైటీ మాజీ చైర్మన్‌లు జి.శివశంకర్‌రెడ్డి, ఎన్‌వి రామకృష్ణ, జయసాయి బిల్డర్స్ అధినేత సాపురివీరయ్య, దాసరిమోహన్, హనుమంతయ్య, దుపాడు నాగేశ్వరరెడ్డి, గంగాధర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్ మూసివేత కారకులపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు- రెండో రోజూ మెప్మా ఆర్‌పిల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహిళా మార్ట్ మూతకు కారణమైన అధికారులపై చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు డిమాండ్ చేశారు. వసూలు చేసిన రూ.66 లక్షలను పొదుపు మహిళలకు చెల్లించాలని కోరారు. ఎపి మెప్మా ఆర్‌పిల సంఘం, పొదుపు లక్ష్మి గ్రూపుల సమన్వయ కమిటీ చేపట్టిన నిరవధిక నిరసన శనివారం రెండోరోజూ సాగింది. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కార్యదర్శి ఉమాదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడారు. మహిళా మార్ట్ ఏర్పాటు కోసం రూ.66 లక్షలు వసూలు చేసి నిర్వహణ చేయలేక చేతులెత్తేసిన మెప్మా పీడీ, ఐబిలదే బాధ్యత అని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల మహిళా మార్ట్ మూతకు కారణమైందని, అందుకే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని పొదుపు మహిళల పెట్టుబడిని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే బాధ్యులను శిక్షించి రాష్ట్ర ప్రభుత్వమే పొదుపు మహిళలకు డబ్బులు చెల్లించాలని కోరారు. ఎపి మెప్మా ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.ఉమాదేవి, అధ్యక్షులు పి.రుద్రమ్మ, కోశాధికారి సుజాత, ప్రసాద్, నగర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీ బాయ్, ఎస్.షబానా మాట్లాడుతూ... ఆర్‌పిల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు జె.దివాకర్ మాట్లాడుతూ... మెప్మా ఆర్‌పిలుగా డిమాండ్ న్యాయమైందని తెలిపారు. సిఐటియు నాయకులు గోపాల్, ఆర్‌పిలు సి.మంజుల, కన్యక, బి.జ్యోతి, రాజేశ్వరి, గౌతమి, లలిత, ముంతాజ్, సోనీ, మహేశ్వరి, రేణుక, పొదుపు సభ్యులు కుమారి, సీతమ్మ, రాధిక, పల్లవి, రేణుక, పద్మావతి, గీత, విజయలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

ఆర్‌పిల ధర్నాకు సంఘీభావంతెలిపి మాట్లాడుతున్నఎస్‌డ్బ్ల్యుఎఫ్ నేత దివాకర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కెపిఎస్ అధ్యక్షులు శ్రీహర్ష

24 , 25 తేదీల్లో జల సమర దీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించాలని కోరుతూ ఈనెల 24,25 తేదీల్లో జల సమర దీక్ష చేపడుతున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగరంలోని స్థానిక బిర్లా కాంపౌండ్ లో ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యంత వెనుకబడిన మన ప్రాంతానికి జీవనాడి అయిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి జలసమర దీక్ష చేపట్టామన్నారు. పాలకులు చూపుతున్న వివక్షకు వ్యతి రేకంగా జిల్లావాణిని బలంగా వినిపించే సమయం వచ్చిందని చెప్పారు. ఈ నెల 24న ఉదయం 9:30 గంటలకు రాజ్ విహార్ ఆర్‌టిసి పాత డిపో నుండి ధర్నా చౌక్ వరకు రైతులు, యువత, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి దీక్షను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు ప్రతి ఒక్కరు వచ్చి మద్దతు తెలియజేయాలని కోరారు. ఆర్థిక నిపుణులు ప్రొఫెసర్ మన్సూర్ రహ్మాన్, కెపిఎస్ సభ్యులు నౌషాద్, శ్రీనివాసులు, రామాంజనేయులు, ప్రేమ్, ధర్మరాజు పాల్గొన్నారు.

కేతవరం లేబర్ కాంట్రాక్టు కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

- ఐదుగురు పాలకమండలి సభ్యులు ఏకగ్రీవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం కేతవరంలో కేతవరం లేబర్ కాంట్రాక్టు కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పాలకమండలి సభ్యుల ఎన్నికకోసం కోఆపరేటివ్ సొసైటీ అధికారులు, సీనియర్ ఇన్‌స్పెక్టర్/ఎన్నికల అధికారి జి.రామకృష్ణయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.నాగరమణయ్య, ఎఆర్.రాజయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, ట్రెయినీ ఎస్ఐ అనిల్ కుమార్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు. పాలకమండలి ఐదు స్థానాలకు గాను మేకలరంగస్వామి, బి.వెంకటేశ్వర్లు, టి.సూర్యనారాయణ, జి.శ్రీధర్, బి.నాగరాజు నామినేషన్లు మాత్రమే రావడంతో ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన పాలకమండలి సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారులు అందజేశారు. సొసైటీ మాజీ కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ... 1984లో ఏర్పాటైన సొసైటీ గని కార్మికుల అభివృద్ధికి కృషి చేసిందని, మధ్యలో కొంత ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పాలకమండలి సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేసి సొసైటీని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికైన పాలకమండలి సభ్యులు మేకల రంగస్వామి, బి.వెంకటేశ్వర్లు, జి.శ్రీధర్, టి.సూర్యనారాయణ, బి.నాగరాజు, సొసైటీ సభ్యులు, గని కార్మికులు బి.నాగన్న, జి.మధు, బుగ్గ రాముడు, వెంకటస్వామి, లలితమ్మ, నాగమ్మ, తిమ్మక్క, పెద్ద మద్దిలేటి, అహ్మద్ రసూల్, ఈశ్వర్, భాస్కర్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

యుటిఎఫ్ నాయకునికి పితృవియోగం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యుటిఎఫ్ సీనియర్ నాయకులు బి.రాఘవేంద్ర తండ్రి బచ్చు రంగయ్య శెట్టి (83) శనివారం ఉదయం మృతి చెందారు. రంగయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు బి.రాఘవేంద్ర సంతానం. రంగయ్య శెట్టి మంచి వ్యవసాయదారునిగా, కిరాణ వ్యాపారిగా కుటుంబంలోని వారిని ఉన్నత చదువులు చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దారు. వ్యవసాయం పట్ల అత్యంత మక్కువ ఉండేది. అందుకే కొంతకాలం రైతుగా వ్యవసాయం చేశారు. తర్వాత ఎమ్మిగనూరు పట్టణంలో చేరి కిరాణ దుకాణం నడిపారు. కుటుంబంలోని వారు, కుమార్తెలు, కుమారుడు అన్ని విధాలుగా ఎదగడానికి కృషి చేశారు. యుటిఎఫ్ ఉద్యమంలో రంగయ్య తనయుడు రాఘవేంద్ర కృషి, ఎదగటానికి అన్ని రకాల సహకారాన్ని తండ్రి నుంచి పొందారు. రాఘవేంద్ర విద్యార్థి ఉద్యమ దశ నుంచి ఉపాధ్యాయ ఉద్యమ దశ వరకు వివిధ రకాలైన సేవలను అందించారు. రంగయ్య మృతికి వివిధ ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల అధ్యక్షులు ఈ.గోవిందు, రైతు సంఘం నాయకులు హనుమంతు రంగయ్య మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

అడ్డ రోడ్లు అధ్వానం..!

- కంకర తేలి, గుంతలు... - ఇరువైపులా ముళ్ల చెట్లు
- అవస్థలు పడుతున్న రైతులు, వాహనదారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

గుంతకల్లు నుంచి ఆలూరు, ఆదోనికి వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బి రహదారి నుంచి గ్రామాల్లోకి వెళ్లే అడ్డరోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. గుంతలతో పాటు కంకర తేలి అధ్వాన స్థితిలో ఉన్నాయి. ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉందని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు అసహనం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి మండలంలో చాలా గ్రామాలకు ప్రధాన రహదారి నుంచి గ్రామాల్లోకి వెళ్లే రోడ్లు ఉన్నాయి. రామదుర్గం బస్సు స్టేజీ నుంచి రామదుర్గం గ్రామంలోకి వెళ్లే రహదారి, తిమ్మాపురం గ్రామానికి వెళ్లే అడ్డ రోడ్డు, నేమకల్లు బస్ స్టేజీ నుంచి నేమకల్లు, సంగాల గ్రామాల్లోకి, అలాగే కుందనగుర్తి అడ్డ రోడ్డు అధ్వాన స్థితిలో ఉన్నాయి. ప్రయాణాలు చేయాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. వర్షాకాలంలో.. రాత్రి సమయంలో బస్సులు దిగి గ్రామాల్లోకి నడిచి పోవాలంటే కూడా ఇబ్బందిగా పడుతున్నారు. దీనికి తోడు రోడ్లకు ఇరువైపులా ముళ్ల చెట్లు, విద్యుత్ సరఫరా లేదు. పాములు తిరుగుతుంటాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రైతులు పొలాలకు ఎరువులు, విత్తనాలు కొని తెచ్చుకోవడానికి ఈ రోడ్ల పరిస్థితి చూసి వెనకడుగు వేసే పరిస్థితి ఉంది. చిప్పగిరి నుంచి ఏరూరు గ్రామానికి వెళ్లే 8 కిలోమీటర్ల రహదారి అంతా గుంతలు, కంకర తేలి ఉంది. ఈ అధ్వాన రహదారి వలన రోజూ ప్రయాణం చేసే

అధ్వానంగా ఉన్న అడ్డరోడ్డు

డేగులపాడు, ఏరూరు గ్రామాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తమ గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. నంచర్ల అడ్డ రోడ్డు పరిస్థితి మరీ ఘోరంగా తయారయింది. అధికారులకు తెలుపుతున్నా పట్టించుకోవడం లేదని ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఏరూరు రహదారిని, గ్రామాలకు వెళ్లే అడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది

- లక్ష్మన్న, నేమకల్లు గ్రామం

చిప్పగిరి మండలంలో అడ్డ రోడ్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. వృద్ధులు, గర్భిణులు ఆటోలో ప్రయాణించినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. మా నేమకల్లు అడ్డ రోడ్డు పరిస్థితి చాలా అధ్వానంగా మారింది. గుంతకల్లు పట్టణం నుంచి నేమకల్లు రోడ్డు వరకు ప్రయాణం ఒక ఎత్తు అయితే, రోడ్డు దగ్గర నుంచి గ్రామంలోకి వెళ్లే అడ్డ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

జిల్లా సాధనకు సంపూర్ణ మద్దతు

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



శిబిరంలో మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధిలో వెనుకబడిన ఆదోని రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా ఏర్పాటు చేస్తేనే ప్రగతి పథంలో నడుస్తామని, జిల్లా సాధనకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని, మేజర్ గ్రామమైన పెద్ద హరివాణాన్ని మండలంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని భీమాస్ కూడలిలో చేపట్టిన దీక్ష శనివారం ఏడో రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో జనసేన మండల అధ్యక్షులు తాహేర్ వలీ, నాయకులు జయరాం, శాంతా, ప్రకాష్, టిడిపి నాయకులు శేషారెడ్డి కూర్చున్నారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, యువ నాయకులు మారుతి నాయుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పనుల నిమిత్తం కలెక్టర్ కార్యాలయం, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి కర్నూలు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఆదోని జిల్లా అయితే పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు కూడా గళం విప్పి ఆదోని జిల్లాకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆదోని జిల్లా ఆవశ్యకత గురించి టిడిపి అధిష్టానానికి విన్నవించామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. శిబిరానికి మద్దతు ఇచ్చిన వారికి పెద్దహరివాణం మండల సాధన కమిటీ నాయకులు ఆదినారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇంగలదహల్ ఎంపిటిసి మల్లికార్జున మద్దతు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎమ్మిగనూరు వ్యవసాయ డివిజన్‌లో కంది పంట 3,738 ఎకరాల్లో, గోనెగండ్ల మండలంలో 1,220 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం సాగు చేసిన కంది మొగ్గ, పూత, కాయ దశలో ఉంది. ఇప్పుడు సకాలంలో సరయిన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఎమ్మిగనూరు ఎడిఎ ఎస్.మహ్మద్ ఖాద్రీ తెలిపారు. ఈ దశలో కంది పంటను ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్లు, వాటి నివారణకు రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి శనివారం ఆయన వివరించారు.

మారుకా మచ్చల పురుగు నివారణ చర్యలు

ఈ పురుగు రెక్కల పురుగు గుడ్ల నుంచి పొదిగిన లార్వాలు ఆకులు, పూత, కాయలను చుట్టలుగా చేసుకొని లోపల నుంచి వాటిని తిని నష్టం చేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా నోవాలురాన్ 1 మిల్లీ లీటర్ లేదా అంప్లిగో మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

కాయ ఈగ నివారణ చేపట్టాల్సిన చర్యలు

ఈ పురుగు కనబడకుండా చాలా నష్టం కలుగజేస్తుంది. ఈగ తన గుడ్లను కాయ, చర్మం తొలిచి అక్కడ పెడుతుంది. వాటి నుంచి పొదిగిన పిల్ల పురుగులు లోపల నుంచి కాయలను తినేసి తీవ్రమైన నష్టం కలుగజేస్తాయి. వీటి నివారణకు ముందస్తుగా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయాక్లోప్రిడ్ 0.7 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

శనగ పచ్చ పురుగు నివారణ చర్యలు

ఈ పురుగు లార్వాలు కాయలపై రంధ్రం చేసుకొని లోపలికి వెళ్లి కాయలోని గింజలను తిని నష్టం కలుగజేస్తాయి. ఈ పురుగు నివారణకు ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.3 గ్రాములు లేదా స్పినోసాడ్ 0.3 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో, 2 శాతం బెల్లం ద్రావణం కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారి చేసుకోవాలి. ప్రస్తుతం కంది పంట బాగా ఏపుగా పెరిగినందు వల్ల మామూలు పద్ధతుల్లో పిచికారి కొద్దిగా కష్టంగా ఉంటుంది. డ్రోన్ ద్వారా పిచికారి చేసుకుంటే మందు ద్రావణంతో మొక్క పైభాగం బాగా తడపవచ్చు. ఫలితం కూడా బాగా ఉంటుంది. కంది పంటలో పైన తెలిపిన చర్యలు సమగ్రంగా పాటించి నాణ్యమైన, అధిక దిగుబడును సాధించాలని రైతులకు సూచించారు.

ఏపుగా పెరిగిన కంది పంట

ఆదోని నడిబొడ్డున కబ్జా..!

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో రూ.లక్షల విలువైన భూమి కబ్జాకు గురైంది. పట్టణంలోని వైఎంకె స్కూల్ వెనుక భాగంలో సర్వే నెంబర్ 24లో 12 ఎకరాల 40 సెంట్ల విస్తీర్ణం చౌకి మఠానికి సంబంధించిన భూమి ఉంది. అందులో కొంత భాగంలో నిర్మాణాలు జరిగాయి. మిగతా భూమిలో కొందరు లేఅవుట్ అప్రూవల్ పొంది ప్లాట్లుగా విభజించి సెంటు రూ.8 లక్షల చొప్పున విక్రయాలు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఆ భూమి ఎండోమెంట్ పరిధిలోని చౌకి మఠం పేరుతో ఉన్నట్లు ఎండోమెంట్ అసిస్టెంట్ మేనేజర్ రాణి తెలిపారు. శనివారం ఘటనా స్థలానికి వచ్చి కబ్జాకు గురైన తీరును పరిశీలించారు. పాతిన హద్దు రాళ్లను చెరిపి వేసి ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆదోనిలో చౌకి మఠం భూమిని ఏ పద్ధతిలో ఆక్రమించారో అంతు పట్టడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. రెవెన్యూ, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సహకరించినట్లు కూడా విమర్శలు ఉన్నాయి. ఆ భూమిపై పూర్తి సమాచారం సేకరించి సంబంధిత వ్యక్తులు ఎవరన్నది వెల్లడిస్తామని చౌకీమఠం పీఠాధిపతి కల్యాణ్ స్వామి తెలిపారు. గతంలోనే ఈ భూమిపై కొందరు అక్రమార్కులు కన్ను వేశారు. సెంట్ రూ.4 లక్షల ప్రకారం విక్రయాలు కూడా చేశారు. మఠం నిర్వాహకులు జోక్యం చేసుకుని ప్రశ్నించడంతో వివాదం బయటకు వచ్చింది. కొనుగోలుదారులకు సొమ్ము తిరిగి ఇచ్చినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో మారు చౌకి మఠం భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. ఆ స్థలం ఆక్రమణపై కూటమి పెద్దల హస్తమున్నట్లు చర్చ సాగుతోంది. లేఅవుట్ అప్రూవల్ ఏ విధంగా పొందారో సంబంధిత శాఖాధికారులను సంప్రదించి వివరాలు సేకరించి బయట పెడతామని ఎండోమెంట్ అధికారులు తెలిపారు.

కబ్జాకు గురైన భూమిలో రాళ్లను తీసేస్తున్న మఠం మేనేజర్

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఆదోని

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శనివారం ఆదోని అంబేద్కర్ విగ్రహం దగ్గర కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. సిఐటియు నాయకులు పిఎస్.గోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి.వేకప్ప మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గతంలో ఉన్న లేబర్ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఎన్నో పోరాటాల ద్వారా 8 గంటల పని విధానాన్ని అమలు చేశారని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ 13 గంటల పని విధానం తీసుకొచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి గతంలో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు తిప్పన్న, చంద్ర, శ్రీనివాసులు, ఎఐటియుసి నాయకులు భీమేష్, షేక్షావలీ, ఐఎఫ్‌టియు నాయకులు నరసన్న, మణెమ్మ, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు రాముడు, తిమ్మ గురుడు, ప్రసాద్ మాట్లాడారు. భారతదేశంలో 25 కోట్ల నుంచి 30 కోట్ల వరకు సంఘటిత, అసంఘటితంగా ఉద్యోగులు, కార్మికులు రాజ్యాంగ కార్మిక హక్కులు పొందుతున్నారని తెలిపారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు ఎ.సురేష్, కె.ఇస్మాయిల్, జె.నాగరాజు, గోల్డ్ బాషా, ప్రతాప్, ఫకీర్ బాష పాల్గొన్నారు.

ఆదోనిలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇస్తున్న నాయకులు

'పది'లో ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యం : ఎంఇఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న ఎంఇఒ రాఘున్న

పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంఇఒ రాఘున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువు విషయంలో వెనుకంజలో ఉన్న విద్యార్థుల పట్ల వంద రోజుల్లో ప్రణాళిక ప్రకారం తీర్చిదిద్దే బాధ్యత తీసుకోవాలని కోరారు. మండలంలోని 13 పాఠశాలల సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లతో పాటు ప్రధానోపాధ్యాయులు విఠోభరావు, రాజశేఖర్, సుజాత, ప్రసాద్, శాంతి, పరిమళ జ్యోతి పాల్గొన్నారు.

టిడిపి ఇన్‌ఛార్జీ గిరికి పెరుగుతున్న ఆశావహులు

- తెరపైకి ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో టిడిపి ఇన్‌ఛార్జీ బాధ్యతల కోసం పార్టీలో నేతల మధ్య రోజురోజుకు తీవ్రమైన పోటీ పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడును బాధ్యతల నుంచి తప్పించి ఆయన సేవలను మరో విధంగా ఉపయోగించుకునే ఆలోచనలో అధిష్టానం ఉందన్న ప్రచారం సాగుతోంది. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఇన్‌ఛార్జీగా 40 ఏళ్లు మీనాక్షి నాయుడు టిడిపికి సేవలు అందించారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం వయస్సు మీద పడడం, అనారోగ్య సమస్యల కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈనెల చివరిలోపు ఇన్‌ఛార్జీని జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు మార్పు చేసి సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పార్టీ పదవుల కేటాయింపుల్లో కూడా మధ్య వయస్సు, యువతకు ప్రాధాన్యత ఇస్తున్నారని పట్టణ, మండల కమిటీల అధ్యక్ష కార్యవర్గం ప్రకటనను బట్టి తెలిసింది. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పార్టీ కేడర్‌ను ఒకే తాటిపైకి తెచ్చి గెలుపే లక్ష్యంగా పని చేయాలని అధిష్టానం ఆలోచన ఉన్నట్లు టిడిపి శ్రేణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదోని నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బాధ్యతలు మరొకరికి అప్పజెప్పే అవకాశాలు ఉన్నట్లు నాయకులు అంటున్నారు. టిడిపిని అంటిపెట్టుకుని ఉన్న మీనాక్షి నాయుడు ఫ్యామిలీకి ఇన్‌ఛార్జీ బాధ్యతలు కచ్చితంగా అధిష్టానం కట్టబెడుతుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అన్న చాటు తమ్ముడుగా పేరు ఉన్న మీనాక్షి నాయుడు సోదరుడు ఉమాపతి నాయుడుకు ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది.

ఇన్‌ఛార్జీ కోసం ఎవరి ప్రయత్నాలు వారివే..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినప్పటికీ ఆదోని నియోజకవర్గంలో టిడిపి కేడర్ అసంతృప్తితో ఉంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వంట ఏజెన్సీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్ల కేటాయింపుల్లో టిడిపికి తగిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లతో గద్దెనెక్కిన బిజెపి ఎమ్మెల్యేపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదోనికి చుట్టపు చూపుగా వస్తున్నారని, ఆయన లేని సమయంలో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి కార్యకర్తలు చెబుతున్నారు. పనుల నిమిత్తం అధికారుల వద్దకు వెళితే ఎమ్మెల్యే చెబితేనే వింటున్నారని టిడిపి, జనసేన కేడర్ వాపోతున్నారు. అధిష్టానం జోక్యం చేసుకొని టిడిపికి తగిన ప్రాతినిధ్యం దక్కేలా శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇన్‌ఛార్జీ బాధ్యతల కోసం ముందు నుంచి టిడిపి సీనియర్ నాయకులు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తనను నమ్ముకుని ఉన్న వారికి అందుబాటులో ఉంటూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికీ మీనాక్షి నాయుడుతో దూరం పాటిస్తూనే ఉన్నారు. పార్టీ పెద్దల నుంచి సూరం భాస్కర్ రెడ్డికి పిలుపు వచ్చిందని, ఇన్‌ఛార్జీ బాధ్యతలు త్వరలో అప్పగిస్తారని ఆయన గ్రూపు ధీమాతో ఉంది. గతవారం రోజులుగా ఉమాపతి నాయుడుకు ఇన్‌ఛార్జీ ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఉమాపతి నాయుడు కూడా జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ద్వారా అధిష్టానానిన కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ఏ కార్యక్రమం జరిగినా ఉమాపతి నాయుడు చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలతో మమేకమవుతున్నారు. లోకేష్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలు తనకు కలిసి వస్తాయని మీనాక్షి నాయుడు మేనల్లుడు మారుతి నాయుడు కూడా ఇన్‌ఛార్జీ బాధ్యతల కోసం అధిష్టానం పెద్దలకు దరఖాస్తు చేసుకున్నట్లు వినికిడి. మున్సిపల్ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎమ్మెల్సీ బీటీ.నాయుడు పేరు కూడా అధిష్టానం వద్ద పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ఆదోని ఇన్‌ఛార్జీ బాధ్యతల అప్పగింతపై ఉన్న ఉత్కంఠను అధిష్టానం బహిర్గతం చేసి పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపాలని, పార్టీ బలోపేతం వైపు దృష్టి సారించాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే నాయకుల్లో నెలకొన్న విభేదాల వల్ల పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఏదో ఒకటి తేల్చి పార్టీ నాయకులను ఒకే తాటిపైకి తీసుకొచ్చేలా పార్టీ పెద్దలు శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి

ప్రజాశక్తి - చిప్పగిరి

అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి తెలిపారు. శనివారం హౌసింగ్ ఎఇ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నంచర్ల, చిప్పగిరి, బెల్డోన, నగరడోనా గ్రామాలలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లాబకాష్ అధ్యక్షతన మండల అధికారులు, హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు స్థలాలకు, ఇల్లు నిర్మించుకోవడానికి 983 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో ఇప్పటి వరకు 181 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని తెలిపారు. లబ్ధిదారునికి రూ.1.80 లక్షలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. స్థలాలు లేని వారు కూడా నమోదు చేసుకోవాలని, ఈనెల 30 వరకు గడువు ఉందని చెప్పారు. సంబంధిత హౌసింగ్ అధికారులందరూ అర్హులందరికీ హౌసింగ్ స్కీమ్‌లపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండల కార్యాలయం దగ్గర ఉన్న వసతులు లేని హౌసింగ్ కార్యాలయాన్ని పరిశీలించి విద్యుత్, నీటి వసతి కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. హౌసింగ్ ఎఇ వారానికి రెండు రోజులు చిప్పగిరి మండలంలో తిరిగేలా ఆదేశాలిచ్చారు. అనంతరం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసి, అక్కడగా అందుతున్న వైద్య సేవల గురించి పలువురు రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో గర్భిణులు, బాలింతలు కూర్చోవడానికి ఒక వసతి గృహం నిర్మించేలా చూడాలని ప్రభుత్వాస్పత్రి డాక్టర్ అఫ్రోజ్ జహన్ పీడీ దృష్టికి తీసుకెళ్లారు. పీడీ వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, హౌసింగ్ అధికారి కృష్ణ కుమార్, ఏపీవో జుబేర్ అహ్మద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు కలిసి రావాలి

- జిల్లా సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని జిల్లా ఏర్పాటుతో పాటు మండలాల విభజనకు అందరూ కలిసి రావాలని ఆదోని జిల్లా సాధన కన్వీనర్ ఆదినారాయణ, లత, ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, రఘురామయ్య కోరారు. శనివారం స్థానిక ఓ సమావేశపు భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం వారు మాట్లాడారు. ఆదోని ప్రజలను కేవలం ఓట్ల యంత్రాలుగా చూస్తున్నారని, ఒకప్పుడు ఆదోనిలో, ఇక్కడున్న నాయకుల వల్ల ఆదోని జిల్లా చేయలేక పోయారని విమర్శించారు. ఆదోనిని జిల్లా చేయకపోతే మరో 100 సంవత్సరాలు వెనక్కి పోతుందని తెలిపారు. ఆదోనిని జిల్లా చేసి ఇక్కడ ఉండే సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని కోరారు. ఈ ప్రాంతం నుంచి ప్రజలు వలసలు ఎక్కువగా పోతుంటారని, జిల్లా అయితే వలసలను నివారించవచ్చని తెలిపారు. అలాగే కేంద్రం నుంచి నిధులు వస్తాయని చెప్పారు. అలాగే పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం 35 కిలోమీటర్లలోపు ఉంటాయని, పరిపాలన సౌలభ్యం బాగా జరుగుతుందని తెలిపారు. ఆదోనిని జిల్లా చేసే వరకు పోరాడుతామని, అలాగే నాలుగు మండలాలు ప్రకటించేంత వరకు పోరాడతామని హెచ్చరించారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, దేశెట్టి ప్రకాష్, చిన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

సిఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - ఆదోని

పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శనివారం ఆదోనిలోని క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పార్థసారథి అందజేశారు. ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని అర్హులైన 32 మందికి రూ.13,58,539 చెక్కులను అందజేశామన్నారు. వివిధ రకాల వ్యాధులతో, ప్రమాదాలు, అనారోగ్యానికి గురై ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వం పేదలకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ సహాయంతో పేద కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని, కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. శనివారం మండలంలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలోని బిఆర్‌బి ఫామ్‌హౌస్‌లో హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఐక్యత పాదయాత్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంతకుముందు బిఆర్‌బి ఫామ్ హౌస్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి సభ వేదికపై ఉన్న నాయకులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న, కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, బిజెపి రాష్ట్ర సెక్రటరీ గీతా మాధురి, సీనియర్ నాయకులు విట్టా రమేష్, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు సునీల్ రెడ్డి, బిజెపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, దయాసాగర్, దేశాయ్ గురురాజ్ రావు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మూడు గడ్డి వాములు దగ్ధం

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ముగుమానుగుంది గ్రామంలో రైతులు కురువ శేషప్ప, శరణప్ప, గోపాల్‌కు చెందిన మూడు గడ్డి వాములు శనివారం దగ్ధమయ్యాయి. బాధితుల వివరాల మేరకు... శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో గడ్డి వాముల నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు కేకలు వేయడంతో అందరూ గుమ్మిగూడారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.లక్షకు పైగా ఉందని, భాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మంటలను ఆర్పుతున్న స్థానికులు

నగరాభివృద్ధికి ప్రజల సహకారం కీలకం

- పశువులను బహిరంగ ప్రదేశాల్లో వదిలితే చర్యలు
- రెస్టారెంట్‌లో మిగిలిన ఆహారం బహిరంగ ప్రదేశాల్లో పారవేయొద్దు
- ప్రతి పౌరుడు 'పురమిత్ర యాప్' డౌన్లోడ్ చేసుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ పి. విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న కమిషనర్ పి. విశ్వనాథ్

పశువులను యజమానులు బహిరంగ ప్రదేశాల్లో వదిలేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పి. విశ్వనాథ్ అన్నారు. నగరపాలక కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడి సహకారం కీలకమన్నారు. రహదారులపై పశువుల సంచారాన్ని నియంత్రించడం, ఖాళీ స్థలాలను చెత్తతో అపరిశుభ్రంగా ఉంచిన యజమానులపై చర్యలు ఉంటాయన్నారు. హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పారవేయడాన్ని అరికట్టడం, పురమిత్ర యాప్ వినియోగాన్ని ప్రతి కుటుంబానికి విస్తరించే అంశాలపై సమీక్షించారు. నగర పరిశుభ్రత, రహదారి భద్రత, ఆరోగ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. పశువులను రహదారులపై వదిలితే గోశాలకు తరలించి, వారంలోపు జరిమానా చెల్లించి తీసుకోకపోతే యాజమాన్య హక్కులు రద్దవుతాయని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాలను మూడు రోజుల్లో యజమానులు శుభ్రం చేసుకోకపోతే నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహారాన్ని బహిరంగ ప్రాంగణాల్లో పారవేయడంతో పరిసరాల పరిశుభ్రత దెబ్బతిని స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారులు లేదా డ్రెయినేజీ కాల్వల్లో పారవేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 119 రకాల నగరపాలక సేవలను సులభంగా అందుకునేందుకు ప్రతి కుటుంబం పురమిత్ర యాప్ తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకుని సమస్యలను వెంటనే తెలియజేయాలని కోరారు. నగర రూపురేఖలను మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఇన్‌ఛార్జీ ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, ఆర్‌ఒలు జునైద్, స్వర్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష పాల్గొన్నారు.

క్విజ్ పోటీలలో డాక్టర్ కెవిఎస్ఆర్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

అభినందించిన కళాశాల చైర్మన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

డాక్టర్ కెవి సుబ్బా రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కర్నూలు విద్యార్థులు శాస్త్రీయ ప్రతిభను మరోసారి ప్రదర్శించారు. సెస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఎ) కర్నూలు జిల్లా శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి ఫార్మసీ క్విజ్ పోటీలలో డా కెవిఎస్ఆర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ప్రథమ బహుమతిని సాధించారు. ఈ పోటీలు ఫార్మసీ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడం, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడం, పరిశ్రమ–అకాడమిక్ అనుసంధానాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. వివిధ కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో డాకక్టర్ కెవిఎస్ఆర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ప్రత్యేకంగా నిలిచారు. ఈ విజయంపై సంస్థ ఛైర్మన్ డాక్టర్ కెవి. సుబ్బా రెడ్డి విద్యార్థులను అభినందించారు. మా కళాశాల విద్యార్థులు జాతీయ రాష్ట్ర స్థాయిలో నిరంతరం ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థులకు మరింత నైపుణ్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. కరస్పాండెంట్ సెక్రటరీ ఎస్. విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ ఇలాంటి విజయాలు మా సంస్థకు గౌరవాన్ని తీసుకువస్తాయి అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బివి.రమణ మాట్లాడుతూ మా విద్యార్థులు సాధించిన ఈ విజయం అధ్యాపకుల మార్గదర్శకత ఫలితమని తెలిపారు. విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థుల ప్రతిభకు కళాశాల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

బహుమతులు అందుకుంటున్న డాక్టర్ కెవిఎస్ఆర్ ఫార్మసీ విద్యార్థులు

కూటమితోనే పంచాయతీల అభివృద్ధి

- రూ.10 లక్షలతో పంచాయతీకి ట్రాక్టర్
- తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్, గ్రామ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్

ప్రజాశక్తి - పత్తికొండ

కూటమి ప్రభుత్వంతోనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్, టిడిపి గ్రామ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్ తెలిపారు. మండలంలోని నలకదొడ్డి పంచాయతీకి ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ ఆదేశాల మేరకు రూ.10 లక్షలతో ట్రాక్టరు వచ్చిందని చెప్పారు. శనివారం వారి చేతుల మీదుగా ట్రాక్టర్‌ను లాంఛనంగా ప్రారంభించి పంచాయతీ సిబ్బందికి అందజేశారు. వారు మాట్లాడుతూ... గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించేందుకు వీటిని వినియోగించాల్సి ఉందని, ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున కేటాయించిందని తెలిపారు. ఈ ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించనున్నారు. ఇప్పటివరకు చిన్న వాహనాల్లో మాత్రమే సేకరిస్తూ వస్తున్నారు. ఇప్పుడు జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు ట్రాక్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామాలు శుభ్రంగా ఉండటంతో పాటు ఏరోజుకారోజు గ్రామంలోని చెత్తను తరలించేందుకు దోహదపడనున్నాయి. పంచాయతీ కార్యదర్శి దివ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎర్రన్న, టిడిపి గ్రామ నాయకులు రఘు శేఖర్, బత్తిన హరి వర్ధన్, దశరథ్, మల్లి పాల్గొన్నారు



హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలం మూడు రాళ్ళపల్లె గ్రామ సమీపంలో వెలసిన అంబాపురం అభయాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి వృషభరాజముల బండలాగుడు పోటీలను పశుపోషకులు పులి రాజ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ పోటీలను ఆలయ కమిటీ పెద్దలు ప్రారంభించారు. ఈ పోటీలకు నంద్యాల, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు నగదు అందజేసారు.

జాబ్ ట్రైనింగుపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా పరిధిలోని వివిధ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం 'ఆన్ ది జాబ్ ట్రైనింగ్'పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా వృత్తి విద్యా అధికారి, కమిటీ ఛైర్మన్ డాక్టర్ సి.సురేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు కోర్సులో భాగంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో క్రమపద్ధతిలో ఓజేటి శిక్షణ పొందాలని తెలిపారు. దీని ద్వారా ప్రాక్టికల్ నైపుణ్యాలు, పరిశ్రమ అనుభవం పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు. రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్, కో ఛైర్మన్ జి.లాలప్ప, టౌన్ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ... విద్యార్థులు ఈ శిక్షణను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.

పారిశుధ్య సిబ్బంది, ఆశాలకు, గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎంపిడిఒ రాముడు

దోమల నివారణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరు మండల పరిధిలోని పులకుర్తి గ్రామాన్ని కోడుమూరు ఎంపిడిఒ ఎసి రాముడు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామం లో పారిశుధ్య కార్యక్రమం నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. సంబంధిత గ్రీన్ అంబాసిడర్స్ కి సూచనలు ఇవ్వడం జరిగినది అదేవిధంగా డెంగ్యూ వ్యాధులు ఉన్నటువంటి రెండు ఇండ్లను సందర్శించారు. ఆ ఇండ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి దోమల వ్యాప్తి చెందకుండా శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అనేది గ్రామ, శానిటేషన్ కమిటీ బాధ్యత అని అందులో పంచాయతీ కార్యదర్శి సర్పంచి, ఎఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీరందరూ కూడా బాధ్యతగా గ్రామంలో కమిటీగా ఏర్పడి ప్రతి ఒక్కరు కూడా సమన్వయం చేసుకొని సమిష్టి బాధ్యతగా పని చేస్తున్నారు. స్థానిక అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల నిర్వహణపై శనివారం కలెక్టరేట్లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 23న జిల్లాలో, అన్ని మండలాల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, సత్యసాయి సేవా సమితి కర్నూలు కన్వీనర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.



జల సమర దీక్షకు కదలి రండి

ప్రజాశక్తి-సి బెళగల్

గుండ్రేవుల ప్రాజెక్టు సాధనకు కర్నూలులో చేపట్టే జల సమర దీక్షకు వేలాదిగా తరలి రావాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక నాయకులు శ్రీ హర్ష ప్రజలకు, యువతకు, రైతులను కోరారు. శనివారం సి.బెళగల్ లో ప్రజా సంఘాల నాయకులు, పోలాసి వెంకటేష్, పరమేష్, ఇస్మాయిల్, రవి, కరుణ, అంజి, తదితరుల సమక్షంలో గోడ పత్రిక విడుదల చేశారు. ఈ నెల 24,25 తేదీలలో కర్నూల్ ధర్నా చౌక్ వద్ద దీక్షకు పూనుకున్నట్లు పేర్కొన్నారు. ఈ డ్యామ్ సాధించుకుంటే జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు, పది లక్షల మందికి తాగు నీరు అందు తుందని మొత్తానికి పరిసరాలలో పంటలతో సష్య శామల మేనన్నారు. సామజికంగా కదలి దీక్షకు మద్దతుగా నిలవాలని కోరారు.

24న చిరుధాన్యాల అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి ఉచిత చిరుధాన్యాల అవగాహన సదస్సు 24న సోమవారం టిజివి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోహన్ కుమార్, సోమశేఖర్, సుంకన్నలు పేర్కొన్నారు. శనివారం కర్నూల్ నగరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అదితి చిరుధాన్యాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అవగాహన సదస్సుకు పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలి హాజరవుతున్నారని పేర్కొన్నారు. కర్నూలు టీజీవి కలక్షేత్రంలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ సదస్సుకు రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు..

డిగ్రీ కళాశాలలో సివి.రామన్ వర్ధంతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్థానిక క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాలలో శనివారం సివి.రామన్ వర్ధంతి నిర్వహించారు. భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి హాజరయ్యారు. ముందుగా సివి.రామన్ చిత్రపటానికి ప్రిన్సిపల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సివి.రామన్ జీవన శైలి, పరిశోధన రంగంలో కృషిని ప్రిన్సిపల్ వివరించారు. వైస్ ప్రిన్సిపల్ ఎ.సత్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ లక్ష్మణ గుప్త, బి.మసూద్ వలీ, డాక్టర్ ఫక్రున్నీసా బేగం, డాక్టర్ మాదన్న, మార్కండేయ ఆచారి, టి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.